సమాచారం

7, 8 తేదీల్లో భక్త సమ్మేళనం

మైలార్‌దేవ్‌పల్లి: రామకృష్ణ–వివేకానంద భావ ప్రచార పరిషత్ రాష్ట్ర స్థాయి 4వ భక్త సమ్మేళనాన్ని కాటేదాన్ అమ్మ గార్డెన్‌లో నిర్వహిస్తున్నట్లు పద్మశాలిపురం రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు బొల్ల శ్రీనివాస్ తెలిపారు. ఈ నెల 7, 8 తేదీల్లో సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గురువారం రామకృష్ణ సేవా సమితి భవనంలో ఆయన మాట్లాడుతూ.. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి భీమపాకం నగేష్, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ హాజరుకానున్నట్లు తెలిపారు. సేవా సమితి ప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున హాజరు కావాలని ఆయన కోరారు.

31లోపు ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోండి

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ సర్కిల్ పరిధిలోని వ్యాపారులు 2023 సంవత్సరానికి గాను ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాలని ఉప కమిషనర్ జగన్ కోరారు. గురువారం సర్కిల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం వ్యాపారుల కోసం ట్రేడ్ లైసెన్స్‌లను జారీ చేస్తున్నామన్నారు. సర్కిల్ పరిధిలో కమర్షియల్‌గా 4,372 ట్రేడ్ లైసెన్స్‌లు ఉన్నాయన్నారు. కొత్తగా దుకాణాలు ఏర్పాటు చేసుకున్న వారు లైసెన్స్ పొందాలని సూచించారు. తనిఖీల్లో లైసెన్స్ లేని వారిని గుర్తించి రెండింతల అపరాధ రుసుం విధిస్తామని, ట్రేడ్ లైసెన్స్ తీసుకొని జీహెచ్ఎంసీ అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. ఈ నెల 31లోపు లైసెన్స్ తీసుకోవడంతో పాటు పాత వారు రెన్యూవల్ చేసుకోవాలన్నారు.

రాజేంద్రనగర్‌లో 4.97 లక్షల ఓటర్లు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ నియోజకవర్గ నూతన ఓటరు జాబితాను ప్రకటించారు. నియోజకవర్గంలో 4,97,937 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. 2,60,843 మంది పురుషులు, 2,37,065 మంది మహిళలు, 29 మంది ట్రాన్స్‌జెండర్లు ఓటర్లుగా నమోదైనట్లు తెలిపారు. నియోజకవర్గంలోని గండిపేట్, రాజేంద్రనగర్, శంషాబాద్ మండలాల పరిధిలో 535 పోలింగ్ బూత్‌లు ఉన్నాయన్నారు.

నేడు స్కీమ్ వర్కర్ల సమ్మె



సమ్మె నోటీసు ఇస్తున్న ఆశా కార్మికులు

మణికొండ: తమ డిమాండ్ల సాధనకు శుక్రవారం స్కీమ్ వర్కర్‌లు సమ్మెలో పాల్గొంటున్నారని గండిపేట మండల ఆశా కార్మికులు మండల వైద్యాధికారి కార్యాలయంలో గురువారం నోటీసు ఇచ్చారు. తమ హక్కుల సాధనకు ప్రభుత్వాలు దిగిరాకపోవటంతో సమ్మెకు వెళ్లాల్సి వస్తుందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్మికులు శ్రీదేవి, అరుణ, లత, కవిత, శంకరమ్మ, రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...


బీరప్ప ఉత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న కమిటీ నాయకులు

మణికొండ: ఈ నెల 23న నిర్వహిస్తున్న పుప్పాలగూడ బీరప్ప ఉత్సవాలకు రావాలని ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్‌ను కమిటీ నాయకులు ఆహ్వానించారు. ఐదు సంవత్సరాలకు ఒక సారి బీరప్ప ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని, ఈ సంవత్సరం ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నామని కమిటీ నాయకులు తెలిపారు. ఎమ్మెల్యేను ఆహ్వానించిన వారిలో కమిటీ నాయకులు, కౌన్సిలర్ కె.లక్ష్మీనారాయణ, మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు బి.శ్రీరాములు, ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, నార్సింగి మున్సిపల్ వైస్ చైర్మన్ జి.వెంకటేశ్‌యాదవ్, మాజీ ఎంపీపీ తలారి మల్లేశ్ తదితరులు ఉన్నారు.

శుభాకాంక్షలు



మైలార్‌దేవ్‌పల్లి: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని గగన్‌పహాడ్ విద్యుత్ రెవెన్యూ సిబ్బంది అధికారులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గురువారం రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్(ఎస్ఈ) ఎల్.గోపయ్య, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్(ఎస్ఏఓ), డివిజనల్ ఇంజనీర్(టెక్నికల్) కె.రామచంద్రయ్యలకు పుష్పగుచ్ఛం అందజేసి గగన్‌పహాడ్ విద్యుత్ రెవెన్యూ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

పట్టణ ప్రగతిలో మెరిసిన నగరాలు



నార్సింగి మున్సిపల్ కమిషనర్‌కు అవార్డు అందిస్తున్న మంత్రి కేటీఆర్



సర్టిఫికెట్ అందుకుంటున్న బండ్లగూడ జాగీరు కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి



అవార్డు అందుకుంటున్న శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ

- రాజేంద్రనగర్ పరిధిలో మూడు మున్సిపాలిటీలకు ఓడీఎఫ్ అవార్డులు
- కేటీఆర్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్న మున్సిపల్ కమిషనర్లు

మణికొండ: బహిరంగ మల విసర్జన లేని మున్సిపాలిటీ(ఓడీఎఫ్ డబుల్ ప్లస్)గా నార్సింగికి అవార్డు దక్కింది. నగరంలో గురువారం జరిగిన ఓ కార్యక్రమంలో రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కేటీఆర్ మున్సిపల్ కమిషనర్ సి.సత్యబాబుకు అవార్డు అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ, బహిరంగ మల విసర్జన లేకుండా అనేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలకు అవసరమైన చోట మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టడంతో ఇది సాధ్యమైందన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని రంగాలలో మున్సిపాలిటీని ఉన్నతంగా నిలిపేందుకు కృషి చేస్తామని, ప్రజలు పూర్తి స్థాయిలో సహకరించాలని ఆయన కోరారు.

బండ్లగూడ జాగీరుకు..

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్‌ను స్వచ్ఛ సర్వేక్షన్ 2022లో ఓపెన్ డెఫికేషన్ ఫ్రీ సిటీగా ప్రకటించారు. మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా కార్పొరేషన్ కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి సర్టిఫికెట్ అందుకున్నారు. ఈ సందర్భంగా తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషనర్ మాట్లాడుతూ.. స్వచ్ఛ సర్వేక్షన్‌లో ప్రజల భాగస్వామ్యంతో ముందుకు వెళ్తున్నామన్నారు. పరిసరాల పరిశుభ్రత, చెత్త చెదారాల తొలగింపు, తడి, పొడి చెత్త వేరు వేరుగా అందించడం తదితర వాటిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఓపెన్ డెఫికేషన్ ఫ్రీ సిటీగా ప్రకటించడం ఆనందంగా ఉందన్నారు.

శంషాబాద్ మున్సిపాలిటీకి..

శంషాబాద్: శంషాబాద్ మున్సిపాలిటీ బహిరంగ మలవిసర్జన రహిత పట్టణంగా అవార్డు దక్కించుకుంది. గురువారం నగరంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి కేటీఆర్, పురపాలక శాఖ డైరెక్టర్ సత్యనారాయణ, జిల్లా అదనపు కలెక్టర్ ప్రతీక్‌జైన్‌ల చేతుల మీదుగా మున్సిపల్ కమిషనర్ సాబేర్ అలీ సర్టిఫికెట్ అందుకున్నారు.

'రాజకీయ కక్షతోనే భూములు లాక్కుంటున్నారు'



పెద్దషాపూర్ తండాలో బాధితులతో మాట్లాడుతున్న ఎంపీటీసీ ఎల్లయ్య

శంషాబాద్ రూరల్: పేద గిరిజన కుటుంబాలకు చెందిన అసైన్డ్ భూములను అన్యాయంగా తీసుకోవడం సబబు కాదని పెద్దషాపూర్ ఎంపీటీసీ చెక్కల ఎల్లయ్య అన్నారు. గురువారం పెద్దషాపూర్ తండాలో బాధితులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. పెద్దషాపూర్‌తండా పంచాయతీ పరిధిలో క్రీడా మైదానం ఏర్పాటుకు సర్వే నంబరు 220లో ఉన్న గిరిజన భూములను బలవంతంగా తీసుకోవడానికి అధికారులు యత్నించడం బాధాకరమన్నారు. రూప్లానాయక్‌కు చెందిన అసైన్డ్ భూమిలో సాగు చేసుకుంటున్న ఉలవ పంటను ధ్వంసం చేశారన్నారు. గ్రామాభివృద్ధి కోసం కావాల్సిన స్థలం కోసం ఇదే సర్వే నంబరులో పీఓటీ కింద సేకరించిన భూములను లేదా ఈ సర్వే నంబరులో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను కేటాయించాలని డిమాండ్ చేశారు. పరపతి కలిగిన వ్యక్తులు పీఓటీ భూముల్లో నిర్మాణాలు చేస్తున్నా పట్టించుకోని పంచాయతీ, రెవెన్యూ అధికారులు పేద గిరిజనులకు అన్యాయం చేయడమేంటని ఆయన ప్రశ్నించారు. రాజకీయ కక్షతోనే మా భూములను లాక్కునేందుకు ప్రయత్నించడంతో పాటు భయాందోళనకు గురి చేస్తున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు గోపాల్‌నాయక్, మాజీ సర్పంచ్ ఇస్రానాయక్, నాయకులు బాబుల్‌నాయక్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

శంషాబాద్ రూరల్: బోధనలో వినూత్న పద్ధతులు అవలంబించి విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని కవ్వగూడలో గురువారం బోధన అభ్యాసన సామగ్రి మేళాకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మేళాలో ప్రదర్శించిన అభ్యాసన సామగ్రిని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల విజ్ఞానానికి సృజనాత్మకత తోడైతే గ్రామీణ ప్రాంతాల్లోని సర్కారు బడుల్లో పేద విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఎమ్మెల్యేను సన్మానించి మొమెంటో అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ జయమ్మ, సర్పంచ్ రమేష్, జెడ్పీటీసీ తన్వీరాజు, ఎంఈఓ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో బీజేపీకి అధికారం ఖాయం



సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

రాజేంద్రనగర్: రాష్ట్రంలో నియంతృత్వ పాలన కొనసాగిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న బీఆర్ఎస్ పార్టీకి గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని రంగారెడ్డి జిల్లా బీజేపీ ఇన్‌చార్జ్ ఎండేల లక్ష్మీనారాయణ, రాజేంద్రనగర్ నియోజకవర్గ పాలక్ మర్రి శశిధర్‌రెడ్డి అన్నారు. రాజేంద్రనగర్ అసెంబ్లీ కన్వీనర్ పొన్నమానేని మల్లేష్‌యాదవ్, జాయింట్ కన్వీనర్ మహలింగంగౌడ్ ఆధ్వర్యంలో నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైవారు మాట్లాడుతూ.. ఈ నెల 7వ తేదీన ఉదయం 10 గంటలకు సామ భూపాల్‌రెడ్డి గార్డెన్‌లో నిర్వహించే కార్యక్రమలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడతారన్నారు. 119 నియోజకవర్గాలకు చెందిన బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు హాజరుకావాలని సూచించారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతుందని, మిగులు బడ్జెట్ ఉన్నా అప్పుల రాష్ట్రంగా మార్చారని, బంగారు తెలంగాణను కాగితాలు, కరపత్రాలకు పరిమితం చేసి అవిటి తెలంగాణగా మార్చారని వారు మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనను ప్రజలు గమనిస్తున్నారని, సరైన సమయంలో సరైన తీర్పు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు డాక్టర్ ప్రేమరాజ్‌యాదవ్, టి.అంజన్‌కుమార్‌గౌడ్, చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ ఎన్.మల్లారెడ్డి, జిల్లా కార్యదర్శి ఎం.కొమురయ్య, నందకిషోర్, చంద్రయ్య, రాచూరి రాజశేఖర్, తోకల సుధాకర్‌రెడ్డి, బొక్క బాల్‌రెడ్డి, ఇందిర, వందన తదితరులు పాల్గొన్నారు.

రాజేంద్రనగర్‌లో 830 మంది ఎమ్మెల్సీ ఓటర్లు

రాజేంద్రనగర్: ఉమ్మడి రంగారెడ్డి, మహబూబ్‌నగర్, హైదరాబాద్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని మూడు మండలాలకు చెందిన ఓటర్ల తుది జాబితాను అధికారులు గురువారం ప్రకటించారు. మూడు మండలాల్లో 830 మంది ఓటర్లు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. అత్యధికంగా గండిపేట మండలంలో 413 మంది, రాజేంద్రనగర్‌లో 285, శంషాబాద్‌లో 132 మంది ఓటర్లు ఉన్నారు. ప్రతి మండలానికి ఒక బూత్ ఏర్పాటు చేశారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఓటర్ల కోసం రాజేంద్రనగర్ జూనియర్ కళాశాలలో, గండిపేట మండల పరిధిలోని ఓటర్ల కోసం నార్సింగి జెడ్పీహెచ్ఎస్, శంషాబాద్ మండల పరిధిలోని ఓటర్ల కోసం శంషాబాద్ జూనియర్ కళాశాలలో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 830 మంది ఓటర్లలో 364 మంది పురుషులు, 466 మంది మహిళలు ఉన్నారు.

క్రమశిక్షణ, పట్టుదలతో లక్ష్యం చేరాలి



మైలార్‌దేవ్‌పల్లి: విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో లక్ష్యాలను సాధించాలని రంగారెడ్డి జిల్లా డీఎస్‌డీవో వెంకటేశ్వరరావు అన్నారు. మహవీర్ గ్రూప్ ఆఫ్ కళాశాలలోని ఇండోర్ ఆడిటోరియంలో నిర్వహిస్తున్న టేబుల్ టెన్నిస్ పోటీల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఏకాగ్రత, పట్టుదల, క్రమశిక్షణ పెంచడానికి టేబుల్ టెన్నిస్ పోటీలు తోడ్పడతాయన్నారు. కార్యక్రమంలో కళాశాలల కార్యదర్శి సంరెడ్డి సురేందర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ ఎస్.ధనుంజయ్‌రెడ్డి, కె.మహేశ్వరి, ప్రకాష్‌రాజ్, నరేందర్‌రెడ్డి, ఇబ్రహీంఖాన్ తదితరులు పాల్గొన్నారు.

టైర్ పేలి అదుపు తప్పిన కారు..

గచ్చిబౌలి: కారు టైరు పేలడంతో అదుపు తప్పి ఔటర్‌పై డివైడర్‌ను ఢీ కొట్టింది. గచ్చిబౌలి డీఐ రవిందర్ తెలిపిన వివరాల మేరకు.. జూబ్లీహిల్స్‌లో నివాసం ఉండే డాక్టర్ మల్లికార్జున్ రాజు భార్య గాయత్రిరాజు, అల్లుడు శివరామరాజు, మనవరాలు శరణ్యరాజుతో కలిసి కారులో యాదగిరి గుట్టకు వెళ్లారు. తిరిగి వస్తుండగా వట్టినాగులపల్లి వద్ద ఔటర్‌పై కారు టైరు పేలడంతో అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఎదురుగా వాహనాలు రాకపోవడంతో ప్రమాదం తప్పింది. శరణ్యరాజు కాలు విరగగా మిగతా ముగ్గురు సురక్షితంగా బయటపడ్డారు. టైరు పగిలిపోవడంతో ప్రమాదం జరిగిందని బాధితులు గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నేటి నుంచి 'రీజనల్ కల్చరల్ మీట్'

రాయదుర్గం: జవహర్ నవోదయ విద్యాలయ రంగారెడ్డి జిల్లా ప్రాంగణంలో రెండు రోజులపాటు హైదరాబాద్ రీజనల్ కల్చరల్ మీట్ అండ్ ఆర్ట్ ఎగ్జిబిషన్–2022–23 కార్యక్రమాన్ని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపాల్ డానియల్ రత్నకుమార్ గురువారం 'సాక్షి'కి వివరించారు. ఈ సందర్భంగా జేఎన్‌వీ హైదరాబాద్ రీజన్ పరిధిలోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, కేరళ రాష్ట్రాలు, పాండిచ్చేరి కేంద్రపాలితప్రాంతాల్లోని జవహర్‌నవోదయ విద్యాలయాలు ఈ రీజనల్ స్థాయి కార్యక్రమంలో పాల్గొంటాయన్నారు. ఈ సందర్భంగా ఆయా జేఎన్‌వీలోని 250 మంది విద్యార్థులు, 40 మంది ఎస్కార్ట్ టీచర్లు, 25 మంది వరకు గురువులు కూడా పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి గోపన్‌పల్లిలోని జేఎన్‌వీ రంగారెడ్డి ప్రాంగణంలో శుక్రవారం 3 గంటలకు హెచ్‌సీయూలోని సరోజిని నాయుడు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కమ్యూనికేషన్ డీన్ ప్రొ.వాసుకి వెలవాడి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభిస్తారన్నారు. నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ రీజన్ డిప్యూటీ కమిషనర్ గోపాల కృష్ణగౌరవ అతిథిగా పాల్గొంటారన్నారు.

ఆలయాల అభివృద్ధికి సహకారం అందిస్తా



మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: దేవాలయాల అభివృద్ధికి సహకారం అందించేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. సులేమాన్‌నగర్ డివిజన్‌లోని హనుమాన్ దేవాలయాన్ని గురువారం కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా బస్తీవాసులతో కలిసి అభివృద్ధి పనులపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేవాలయాలను అధునాతన పద్ధతిలో ఆధునీకరించుకోవాలన్నారు. బస్తీవాసులంతా కలిసికట్టుగా ఉంటూ దేవాలయాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సులేమాన్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు విక్రమ్‌చారి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న భట్టి విక్రమార్క

మైలార్‌దేవ్‌పల్లి: స్కూల్ టీచర్ ఫెడరేషన్(ఎస్‌టీఎఫ్) యూనియన్ కేలండర్‌ను తెలంగాణ కాంగ్రెస్ శాసనసభా పక్ష నేత భట్టి విక్రమార్క గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు, 317 జీవో బాధితులు, ఏకీకృత సర్వీస్ రూల్స్ విషయంలో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. ఎస్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పోచయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవరకొండ సైదులు, ఖమ్మం జిల్లా ఎస్‌టీఎఫ్ అధ్యక్షుడు గుండు యాదగిరి, కార్యదర్శి మన్సూర్, నాయకులు పోతగాని వెంకన్న, బి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ రుణాలకు భారీగా దరఖాస్తులు



దరఖాస్తులు తీసుకుంటున్న సిబ్బంది

రాజేంద్రనగర్: మైనార్టీ రుణాల కోసం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో పెద్ద ఎత్తున దరఖాస్తులు వస్తున్నాయి. ఈ నెల 9 చివరి తేదీ కావడంతో ప్రతి రోజూ వందల మంది దరఖాస్తు చేసుకునేందుకు సర్కిల్ కార్యాలయానికి వస్తున్నారు. రద్దీ నేపథ్యంలో సర్కిల్ కార్యాలయం ఆవరణలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. ఇద్దరు సిబ్బందిని నియమించి దరఖాస్తులు పరిశీలిస్తున్నారు. సర్కిల్ పరిధిలోని శాస్త్రీపురం, సులేమాన్‌నగర్, మైలార్‌దేవ్‌పల్లి, రాజేంద్రనగర్, అత్తాపూర్ డివిజన్‌ల నుంచి గురువారం నాటికి 2,500 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం



ఓంనగర్ కాలనీలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ చేపడుతున్న కార్మికులు

బండ్లగూడ: పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలను జాగృతి పరుస్తున్నట్లు బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ 18వ డివిజన్ కార్పొరేటర్ గోకరి శ్రీలతాసురేష్‌గౌడ్ పేర్కొన్నారు. కార్పొరేషన్ పరిధిలో నిర్వహిస్తున్న శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ గురువారం 13వ రోజుకు చేరింది. 18వ డివిజన్‌లోని ఓంనగర్ కాలనీ, బోజిరెడ్డి, సాయిరాం కాలనీ, వినాయక నగర్ కాలనీ, ధాత్రి కాలనీ, సాయిద్వారకా కాలనీ, సాయిరాం ఎన్‌క్లేవ్, ఆనంద్‌నగర్ కాలనీ, కృష్ణానగర్ కాలనీ, సిరిమల్లె కాలనీ, 60 గజాలు, రాములు కాలనీ, అరుణోదయ కాలనీ, మాచనపల్లి ఎన్‌క్లేవ్, వీర బ్రహ్మేంద్ర కాలనీ, సత్య ఎన్‌క్లేవ్ తదితర ప్రాంతాల్లో పరిశుభ్రత పనులు నిర్వహించారు. పారిశుద్ధ్య కార్మికులు రోడ్లను ఊడ్చి, రోడ్ల పక్కన పేరుకుపోయిన చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శ్రీలతాసురేష్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రజలు తమ ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. చెత్తాచెదారాలను ఎక్కడపడితే అక్కడ వేయకుండా చెత్త సేకరణ కార్మికులకు అందించాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సురేష్, శానిటరీ జవాన్లు మల్లేష్, సురేష్, యాదగిరి, సుభాష్, నరేందర్, రామాంజులు, కృష్ణ, వెంకటేష్, గిరి, శ్రీధర్, నవీన్, మీర్జా తౌఫిక్, లక్ష్మీనారాయణ, జగన్, రాము తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యంగా పనిచేయండి



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్వర్‌ముదిరాజ్

బండ్లగూడ: కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొర్రా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ అన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు ప్రణయ్ ఆధ్వర్యంలో ఎన్ఎస్‌యూఐ నూతన సంవత్సర కేలండర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి బొర్రా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ ముఖ్య అతిథిగా హాజరై కేలండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. ప్రజా సమస్యలను నాయకులు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో అరవింద్, బబ్లూ, విశేష్, అమర్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా వెలిసిన గుడిసెల తొలగింపు



గుడిసెలను తొలగిస్తున్న దృశ్యం

మైలార్‌దేవ్‌పల్లి: కార్గో రోడ్డు మార్గంలో అక్రమంగా వెలిసిన గుడిసెలను జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులతో కలిసి మైలార్‌దేవ్‌పల్లి పోలీసుల పర్యవేక్షణలో తొలగించారు. మైలార్‌దేవ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ పి.మధు, డీఐ జి.రాజేందర్‌గౌడ్‌ల పర్యవేక్షణలో సుమారు 50 మంది పోలీసులు, జీహెచ్ఎంసీ సిబ్బంది గురువారం మధ్యాహ్నం అక్రమంగా వెలిసిన గుడిసెలను తొలగించారు. తెలంగాణ జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాలకు చెందిన వారు గత 8 సంవత్సరాలుగా మైలార్‌దేవ్‌పల్లి నుంచి లక్ష్మీగూడ మార్గంలో రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి అనుసంధానంగా కార్గో రోడ్డు మార్గం ఉంది. ఈ రోడ్డు విస్తరణలో భాగంగా గుడిసెలను తొలగించారు. కొన్ని సంవత్సరాలుగా స్థిర నివాసాలు లేక నామమాత్రంగా గుడిసెలు వేసుకొని చిన్న చిన్న పనులు చేసుకుంటూ జీవిస్తున్న తమ గుడిసెలను తొలగించడంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లక్ష్మీగూడలో నిర్మించిన రాజీవ్ గృహకల్పలో తమకు ఇళ్లు కేటాయించి రేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని వినతి



మున్సిపల్ మేనేజర్‌కు వినతిపత్రం ఇస్తున్న నెక్నాంపూర్ గ్రామస్తులు

మణికొండ: మున్సిపాలిటీకి చెందిన గ్రామకంఠం భూమిని కొందరు అమ్మకాలు, కబ్జాలు చేస్తున్నారని, అధికారులు స్పందించి వెంటనే ప్రహరీ నిర్మాణం చేపట్టి బోర్డు ఏర్పాటు చేయాలని నెక్నాంపూర్ వాసులు కోరారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని నెక్నాంపూర్ గ్రామంలో గతంలో పేదలకు ఫౌల్ట్రీఫాంలు, గోదాముల కోసం ప్రభుత్వ భూమి ఇచ్చారు. అయితే లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోని భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. నెక్నాంపూర్‌లోనూ 400 గజాల స్థలం గతంలో గ్రామకంఠంగా గ్రామపంచాయతీ ఆధీనంలో ఉందన్నారు. ప్రస్తుతం మున్సిపాలిటీకి చెందాల్సిన భూమిని కొందరు అమ్మాలని చూడడం, మరి కొందరు కబ్జా చేయాలని చూస్తున్నారన్నారు. కోట్ల విలువైన స్థలాన్ని అధికారులు రక్షించాలని గ్రామస్తులు మున్సిపల్ మేనేజర్ మల్లారెడ్డికి గురువారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు సి.శంకర్‌సింగ్, సి.అజయ్‌సింగ్, టి.వేణుగోపాల్, యోగేష్‌దూబే, జితేందర్‌మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



వైద్య బృందంతో డైరెక్టర్ డాక్టర్ రామేశ్వరరావు, ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్‌రావు తదితరులు

రాయదుర్గం: ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ రామేశ్వరరావు సూచించారు. గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలోని స్కూల్ ఆఫ్ పోస్టుగ్రాడ్యుయేట్ స్టడీస్, ఎస్కీ బిజినెస్ స్కూల్ ఆధ్వర్యంలో చాణక్య సెమినార్ హాల్‌లో డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీస్, మ్యాక్స్‌విజన్ వారి పర్యవేక్షణలో ఉచిత వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. చదువుతోపాటు విద్యార్థులు ఆరోగ్యంపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటేనే చదువును సులభంగా అర్థం చేసుకొని, మరింతగా చదువుకోవడానికి అవకాశం కలుగుతుందన్నారు. అనంతరం రెడ్డీస్ లేబరేటరీ, మ్యాక్స్‌విజన్ ఆధ్వర్యంలో విద్యార్థులు, అధ్యాపకులు, అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి ఉచితంగా రక్త పరీక్షలు, ఇతర వైద్య పరీక్షలను నిర్వహించారు. ఎస్కీ బిజినెస్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎస్ కృష్ణప్రసాద్‌రావు, ఇతర అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు, రెడ్డీస్ లేబరేటరీ, మ్యాక్స్‌విజన్ వైద్యబృందం పాల్గొన్నారు.